యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



తూంకుంట రీచ్‌లో ఇసుకను కుప్పగా పోస్తున్న జేసీబీ



ఇసుకను తరలించేందుకు వెళ్తున్న ట్రాక్టర్

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దళారులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. మంగళవారం పట్టపగలే జేసీబీ ద్వారా 5 ట్రాక్టర్లు చిన్నంబావి మండలంలోని పలు గ్రామాలకు రెట్టింపు ధరలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ప్రతిసారి ప్రత్యేక పోలీసులే..

తూంకుంట ఇసుక రీచ్ నుంచి ప్రభుత్వానికి, గ్రామ పంచాయతీకి చేకూరాల్సిన ఆదాయానికి గండికొడుతూ దళారులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ప్రతిసారి జిల్లా నుంచి వచ్చే స్పెషల్ బ్రాంచ్ పోలీసులే పట్టుకొని స్థానిక స్టేషన్‌లో అప్పగించగా.. రెవెన్యూ అధికారులు రూ.5వేల జరిమానా విధించి వదిలేస్తున్నారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసుల తీరుపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామా ల్లో ఇప్పటికీ వందల సంఖ్యలో ఇసుక డంపులు ఉన్నా స్థానిక అధికారులు మాత్రం వాటి జోలికి వెళ్లడం లేదు. ఇసుక రీచ్‌లో జవాయిపల్లికి చెందిన స్వామి తన జేసీబీతో ఇసుకను కుప్పలుగా పోస్తుండగా తూంకుంట గ్రామానికి చెందిన పలువురు ట్రాక్టర్ యజమానులు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవలే స్థానిక పోలీసు స్టే షన్‌కు నూతన ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న రాణి అక్రమ ఇసుకపై దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హరీశ్‌రావుకు ఘనస్వాగతం



పెబ్బేరు మండలం నుంచి బయలుదేరిన నాయకులు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహిస్తున్న రైతాంగ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌లకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. హరీశ్‌రావు,శ్రీనివాస్‌గౌడ్‌లకు బీఆర్‌ఎస్ శ్రేణులు పూలబొకేలను ఇచ్చి, శాలువాలతో సన్మానించారు. అనంతరం మాజీ మంత్రులు కార్యకర్తలను, నాయకులకు మనోధైర్యాన్నిచ్చారు. అనంతరం అక్కడి నుంచి వనపర్తికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, వైస్ చైర్‌పర్సన్ భీసం జయమ్మ, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, పి.విశ్వేశ్వర్, గుంత మౌనిక, గాడీల ప్రశాంత్, కౌన్సిలర్లు చీర్ల నాగన్నసాగర్, కొండారెడ్డి, రాములుయాదవ్, కె.శ్రీనివాస్‌జీ, బాబురెడ్డి, చాపల భాస్కర్, లాల్‌కోట రవి, వినోద్‌సాగర్ తదితరులు ఉన్నారు.

ప్రజా సదస్సుకు బయలుదేరిన రైతులు

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు ప్రజా సదస్సుకు మంగళవారం వనపర్తి, శ్రీరంగాపురం,పెబ్బేరు మండలంలోని రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు.



వనపర్తి మండలం నుంచి..

క్లుప్తంగా

నేటి నుంచి ఉర్సు

కొత్తకోట: మండలంలోని నాచారంపేట శివారులో గల అబ్దుల్లాషా ఖాద్రీ ఉర్సు నేటి నుంచి ప్రారంభం అవుతుందని నిర్వాహకులు అజ్మతుల్లాఖాద్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నగేష్‌ను మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం పూలబొకేలను ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో అదనపు కలెక్టర్‌గా 8నెలల పాటు విధులు నిర్వహించిన నగేష్‌ను మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి విశ్వనాథం వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో పనిచేసినన్ని రోజులు నిబద్ధతో పనిచేశారని కొనియాడారు.

సెల్‌ఫోన్ అప్పగింత



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని చెలిమిల్లకు చెందిన యశ్వంత్ సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌పోన్ల ఆచూకీని కనుకొన్న పోలీసులు మొబైల్‌ను స్వాధీనం చేసుకొని మంగళవారం బాధితుడికి అందించామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న శ్రీనివాసులుచారి కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా, రాష్ట్ర నాయకులు మంగళవారం కొత్తకోటకు చేరుకుని శ్రీనివాసులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందజేశారు. శ్రీనివాసులు చారి ఆరోగ్యం కుదుటపడే వరకు టీయూడబ్ల్యూజే అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, కొండన్నయాదవ్, రమేష్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, పాలిశెట్టి బాలకృష్ణ, ప్రశాంత్, వెంకటన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

ఖోఖో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక



ఆత్మకూర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ అండర్–14 ఖోఖో జట్టుకు ఆత్మకూర్ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కావ్య ఎంపికయ్యింది. మంగళవారం వనపర్తిలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14 బాలికల ఖోఖో ఉమ్మడి జిల్లాకు జరిగిన ఎంపికలో కావ్య ప్రతిభ కనబరిచిందని, నవంబర్ 4న జరిగే రాష్ట్రస్థాయి జట్టులో పాల్గొంటుందని క్రీడాకారులు తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ కొండాపురం బాలరాజు, ఫిజికల్ డైరెక్టర్ సంతోషిమురళి, కోచ్ ఖాదర్ కావ్యను అభినందించారు.

వేగంగా రహదారి పనులు



అమరచింత: మండలంలోని చంద్రగఢ్ స్టేజీ నుంచి నందిమళ్ల వరకు బీటీ రహదారి పనులు వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ తెలిపారు. నందిమళ్ల రహదారి పనులకు రూ.1.40కోట్లు మంజూరు చేయడంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ చూపారన్నారు. మంగళవారం నందిమళ్ల గ్రామ కచ్చ రహదారిని ఆయన పరిశీలించారు. రహదారి పనుల కోసం నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించినా.. వెంటనే నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు



మైనుద్దీన్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలు అందించిన ఎండీ మైనుద్దీన్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పనిసరి అన్నారు. వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ విద్యార్థుల కోసం కష్టపడే ఉపాధ్యాయులను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని.. ఉద్యోగ జీవితంలో వారి ప్రగతికి అనుక్షణం పాటుపడాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు మైనుద్దీన్ దంపతులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్‌కుమార్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘అమ్మ’ పేరుతో మొక్కలు నాటాలి



అమరచింత: ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాల్లో, గ్రామంలో అమ్మ పేరుతో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నవ యువ చైతన్యం బృందం అధ్యక్షుడు డి.రాజు కోరారు. మండలంలోని నందిమళ్లలో మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఎంపీయూఎస్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని నివారిస్తామన్నారు. కార్యక్రమంలో నవ యువ చైతన్య సేవ బృందం అధ్యక్ష, కార్యదర్శులు దోమర్ల రాజు, మునెప్ప, కృతి, అనిత, మౌనిక, అఖిల్, మైకేల్ పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరి, పత్తి పంట కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాసంగిలో సాగు చేసే వేరుశనగ విత్తనాలు, ఎరువుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

ఏఈఓలు నేలపై కూర్చొని నిరసన

డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంలో ప్రభుత్వం 167 మంది ఏఈఓలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఏఈఓలు నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శైలజ, వెంకటేష్, అఖిల, షర్మిలాదేవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారులు తారశశాంక్, లారెన్స్, రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులొద్దు



మాట్లాడుతున్న చైర్మన్ ప్రశాంత్

మదనాపురం: మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ ఆదేశించారు. మంగళవారం మార్కెట్‌యార్డులో ఆయన మాట్లాడుతూ ఈసారి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి గింజను కొంటామని, సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 31 నుంచి జరిగే కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం గోపాలకృష్ణ గురుస్వామి జన్మదిన సందర్భంగా మండల నాయకులతో కలిసి శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



వీపనగండ్ల: మండల కేంద్రంలో సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం గోవర్ధనగిరిలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నవంబర్ 10, 11 తేదీల్లో జరుగనున్న జిల్లా మూడో మహాసభలలో భవిష్యత్ కార్యచరణ నిర్ణయిస్తామని పార్టీ సీనియర్ నాయకులు తూంకుంట భాస్కర్‌రెడ్డి, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎండీ మహబూబ్‌పాషా, వెంకటస్వామి, పెద్ద ఖాజా, రవిప్రసాద్, ఖాజాహుస్సేన్, మౌలాలి, శ్రీనివాసులు, బిచ్చన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

పాన్‌గల్: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడుతూ వాటిని నివారించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందుల గురించి వివరించారు. యువత ఒక్కసారి వ్యసనాలకు బానిసలు అయితే వాటి నుంచి కోలుకోవడం చాలా కష్టమన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలు అవుతున్న యువత వివరాలు ఉంటే 1908కు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వాటి నివారణపై చైతన్యం చేసే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ వెంకట్‌రెడ్డి, అధ్యాపక బృందం, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం



రక్త నమూనాలను సేకరిస్తున్న పశువైద్య అధికారిణి కరుణశ్రీ

వీపనగండ్ల: పశువులకు గాలికుంటు వ్యాధి సోకడం వల్ల తీవ్ర అనర్థాలు చోటు చేసుకుంటాయని, వాటి నివారణకు రైతులు పశువైద్యుల సూచనలు తీసుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రక్త నమూనాల వ్యాధి నిర్ధారణ వైద్యులు డా.కరుణశ్రీ అన్నారు. మంగళవారం సంగినేనిపల్లిలో పశువుల రక్త నమూనాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు నివారణ టీకా వేయించాలని కోరారు. కార్యక్రమంలో మండల వెటర్నరీ పశువైద్యాధికారి గణేష్‌కుమార్, జూనియర్ వెటర్నరీ వైద్యులు సత్యం, శ్రీధర్, వెటర్నరీ అసిస్టెంట్ మధు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్చక సంఘం కార్యదర్శిగా శ్రీధర్‌జ్యోషి



శ్రీధర్‌జ్యోషిని సత్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

ఆత్మకూర్: ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూలమళ్ల శ్రీపాండురంగస్వామి ఆలయ అర్చకుడు శ్రీధర్ జ్యోషి నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర సదస్సులో ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని అర్చకుల అభ్యున్నతికి, ఆలయాల అభివృద్ధికి పాటుపడతానని శ్రీధర్‌జ్యోషి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకుల కుటుంబాలకు న్యాయం చేయాలని, సంక్షేమ పథకాలన్నింటిని వర్తింపజేయాలని కోరారు. ఈసందర్భంగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ, వనపర్తి అధ్యక్షుడు లక్ష్మీకాంతాచార్యులు, మహబూబ్‌నగర్ అధ్యక్షుడు రవికుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అమరచింతలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

ఆత్మకూర్: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరు ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు..

పట్టణంలోని ఐదో వార్డులో కౌన్సిలర్ పోషన్న ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించి ముమ్మరంగా పారుశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించి, తాగు నీటి కుళాయిల వద్ద పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు.

‘సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం’



ఖిల్లాఘనపురం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మల్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం జానకీరాం అన్నారు. పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాల వద్ద సన్మానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు సమాజంలో ఎలా నడుచుకోవాలనే విషయాలను చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్‌కుమార్, బాటసారి, అనసూయ, సృజన, భవిత కళ్యాణి, శ్రీదేవి, భీంరావు, పాఠశాల ఉపాధ్యాయులు అరుంధతి, జయంతి పాల్గొన్నారు.